



RNI - TELTEL/2023/87644


# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 311 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 27-02-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00



## సెమీస్ రేసులో టీమిండియా..!

### పాండ్యా, అభిషేక్ మెరుపులు..

- భారత్ చేతిలో జింబాబ్వే 72 పరుగుల తేడాతో ఓటమి
- టీ20 ప్రపంచకప్ 2026 సెమీస్‌కు అడుగుదూరంలో భారత్..!
- టీ20 ప్రపంచకప్ 2026 నుంచి జింబాబ్వే ఔట్

న్యూఢిల్లీ,

టీ20 ప్రపంచకప్ 2026 సూపర్-8లో టీమిండియా బోణీ కొట్టింది. గురువారం చెన్నైలోని ఎంఏ చిదంబరం క్రికెట్ స్టేడియంలో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 256 పరుగులు స్కోరు చేసింది. అనంతరం జింబాబ్వేను 184/6 పరుగులకే పరిమితం చేసింది. ఈ ఫలితంతో సెమీస్ అవకాశాలను మెరుగుపర్చుకుంది.257 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే.. ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. కానీ ఆ జట్టు ఓపెనర్ బెన్నెట్ మాత్రం చివరి వరకూ పోరాడాడు. ఓ వైపు వికెట్లు పడుతున్నా.. అతడు మాత్రం నిలబడ్డాడు. చివరకు 59 బంతుల్లో 97 రన్స్ చేసి.. నాటౌట్‌గా నిలిచాడు. అయితే అతడి పోరాటం ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించింది. చివరకు నిర్ణీత 20 ఓవర్లలో జింబాబ్వే 6 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. 72 పరుగుల తేడాతో పరాజయం పాలైంది.

-మిగతా 2 లో

## భారతీయ విద్యాభవన్ తరహాలో

# స్కూళ్లు

### మౌళిక వసతులతో పాటు..బ్రేక్‌ఫాస్ట్

- విజయ డెయిరీ ద్వారా అవసరమైన పాల సరఫరా
- రవాణా కోసం ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం
- ప్రైవేట్ స్కూళ్ల ఫీజులకు కళ్లెం వేసేలా చర్యలు
- విద్యారంగంపై సమీక్షలో సిఎం రేవంత్ కీలక ఆదేశాలు

హైదరాబాద్ ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనపైన దృష్టి సారించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉండాలని సూచించారు. గురువారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌పైన సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు

-మిగతా 2 లో





### అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం

## చిమ్ముతున్న బీఆర్ఎస్

- కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం కమిషన్ల కోసమే నిర్మాణం
- సీబీఐ విచారణ కోరినా పట్టించుకోని బీజేపీ
- మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

తెలంగాణ ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్నారని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాజెక్టుల అవినీతిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే ఎనిమిదో అద్భుతంగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం


-మిగతా 2 లో

## ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

- వసలదారుల పట్ల అనుసరిస్తున్న విధానంపై కోర్టు ఆగ్రహం



2 లో



### బికినీ దుస్తుల్లోని అమ్మాయిలతో

## స్టీఫెన్ హాకింగ్..

- ఎప్‌స్టీన్ ఫైల్స్ ఫోటోల్లో ఖగోళశాస్త్రవేత్త
- బికినీ ధరించిన ఇద్దరు అమ్మాయిలతో ఉన్న ఫోటోను తాజాగా రిలీజ్
- సెక్స్ అఫెండర్ ఎప్‌స్టీన్‌కు చెందిన ఫైల్స్‌లో హాకింగ్ ఫోటో ఉండడం గమనార్హం.

వాషింగ్టన్

మోటార్ న్యూరాన్ వ్యాధితో బాధపడుతూ.. వీల్ చైర్ నుంచే విశ్వరహస్యాలను చేధించిన స్టీఫెన్ హాకింగ్ కూడా జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌కు చిక్కారు. బ్రిటీష్ ఖగోళ శాస్త్రవేత్త హాకింగ్.. బికినీ ధరించిన ఇద్దరు అమ్మాయిలతో ఉన్న ఫోటోను తాజాగా రిలీజ్ చేశారు. ఆ ఫోటోను ఎప్‌స్టీన్ ఫైల్స్ నుంచి బయటకు తీసినట్లు తెలిసింది. సెయింట్ థామస్‌లోని రిట్జ్ కార్లటన్ హోటల్‌లో జరిగిన సైన్స్ సదస్సు సమయంలో 2006లో ఆ ఫోటో తీసినట్లు అంచనా వేస్తున్నారు. సూర్యరశ్మి కోసం సేదతీరే కుర్చీపై వాలిన హాకింగ్ చేతిలో కాక్‌టెయిల్ ఉన్నది. హాకింగ్ దగ్గర అటూ ఇటూ నిలుచున్న ఇద్దరు అమ్మాయిలు బికిని దుస్తుల్లో ఉన్నారు. ఆ ఇద్దరు కూడా కాక్‌టెయిల్ పట్టుకున్నారు.అమెరికా ఫైనాన్షియర్, సెక్స్ అఫెండర్ ఎప్‌స్టీన్‌కు చెందిన ఫైల్స్‌లో హాకింగ్ ఫోటో ఉండడం గమనార్హం. అయితే ఆ ఫైల్స్‌లో సైంటిస్ట్ హాకింగ్‌కు చెందిన చాలా ఫోటోలు ఉన్నట్లు తెలుస్తోంది. సెయింట్ జేమ్స్ దీవిలో ఉన్న ఎప్‌స్టీన్ రిసార్టును విజిట్ చేసిన 21 మంది శాస్త్రవేత్తల్లో హాకింగ్ కూడా ఒకరు. బ్లాక్ హోల్స్ రహస్యాన్ని విప్పిన హాకింగ్‌కు చెందిన 250 ఫోటోలు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉన్నట్లు తెలిసింది. 76 ఏళ్ల వయసులో హాకింగ్ 2018లో మరణించారు. 2006లో ఎప్‌స్టీన్ ఫండింగ్ చేసి నిర్వహించిన ఓ కాన్ఫరెన్స్‌లో హాకింగ్ పాల్గొన్నట్లు తెలిసింది.

-మిగతా 2 లో

### తెలంగాణలో భారీగా

## ఐఏఎస్‌ల బదిలీలు

- మొత్తం 45మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు
- పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం




హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 45 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.


-మిగతా 2 లో

### ఇజ్రాయెల్-భారత్ మధ్య

## స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

### ఇకపై ఇజ్రాయెల్‌లోనూ యూపీఐ సేవలు :

- ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు
- ఇజ్రాయిల్ పర్యటనలో ప్రధాని మోడీ ప్రకటన
- త్వరలోనే ఇండియా వస్తానన్న నెతన్యాహు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

ఇజ్రాయెల్-భారత్ మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరనుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. అలాగే ఇజ్రాయెల్‌లో కూడా త్వరలో యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. యూపీఐ పేమెంట్స్‌తో పాటు ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరాయి. రెండు దేశాల మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరగనున్నట్టు ఇరు దేశాల ప్రధానులు సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. మొత్తం 27 రంగాల్లో పరస్పర సహకారానికి ఇరు దేశాలు

-మిగతా 2 లో

### దోమల బెడదతో

# వణుకుతున్న హైదరాబాద్



### దోమల దండయాత్రపై యంత్రాంగం నిద్రలోనా?

- 27 వేల హాట్‌స్పాట్లు గుర్తించినా... చర్యలు ఎక్కడ?
- చెరువుల నిర్వహణలో జాప్యం బాధ్యత ఎవరిది?
- ఫాగింగ్ ఫెయిల్యూర్‌నా... లేక పర్యవేక్షణలో లోపమా?
- కోట్ల నిధులు ఖర్చయినా ఫలితం ఎందుకు కనిపించడం లేదు?
- డెంగీ ముప్పు తలెత్తితే జవాబు ఎవరు చెబుతారు?
- ఒక్క ఫాగింగ్ మిషన్‌తో మహానగరం కాపాడగలరా?
- ప్రజల ఆరోగ్యం పణంగా పెట్టి అధికారులు నిశ్శబ్దం ఎందుకు?
- దోమల సమస్యపై తక్షణ చర్యలు ఎప్పుడూ?
- నీలగిరి ఎక్స్ ప్రెస్ ప్రత్యేక కథనం ( సబ్ ఎడిటర్, అలేటి నవీన్ )

హైదరాబాద్, ఫిబ్రవరి 26 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )

: హైదరాబాద్ మహానగరంలో కంటి మీద కునుకు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు దీనికి అధికారుల నిర్లక్ష్యమా..? సాయంత్రం అయ్యిందంటే చాలు... తలుపులు, కిటికీలు మూసేసుకుని వణికిపోతున్నారు నగరవాసులు. కారణం దోమలు! ఎప్పుడూ లేని స్థాయిలో హైదరాబాద్ నగరంపై దోమల దండయాత్ర కొనసాగుతోంది. చెరువులు, నాలాలు, మురుగు కాలువల పరిసర ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. రాత్రంతా దోమకాట్లతో జాగారం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

- హాట్ స్పాట్లు పెరిగిపోతున్నాయా?

ప్రాథమిక సమాచారం ప్రకారం మూసాపేట, కూకట్‌పల్లి, మల్కాజగిరి, అత్తాపూర్, కాప్రా, మణికొండ, టోలీచౌకి, ఉప్పల్, నాచారం, ఎల్బీనగర్, అంబర్‌పేట్ ప్రాంతాల్లో దోమల తీవ్రత ఎక్కువగా ఉంది. ముఖ్యంగా మూసాపేట గ్రీన్ హిల్స్ రోడ్ పరిసర ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల పరిసరాల్లో నరకయాతన అనుభవిస్తున్నారు దుర్గం చెరువు, నెక్నాంపూర్ లేక్, మూసీ నది పరిసర ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడం, గుర్రపు డెక్క తొలగింపులో జాప్యం, డ్రైనేజీ సమస్యల కారణంగా దోమల సంతతి విపరీతంగా పెరిగిందని స్థానికులు చెబుతున్నారు.

- కాంట్రాక్ట్ జాప్యం నిర్వహణలో లోపమా?

చెరువుల శుభ్రత పనులకు సంబంధించిన కాంట్రాక్టులు గత ఏడాది అక్టోబర్‌తో ముగిసినా రీన్యూవల్ ప్రక్రియ ఆలస్యమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో చెత్త తొలగింపు పనులు నిలిచిపోయాయి. ఫిబ్రవరి మొదటి వారంనుంచే దోమల సమస్య తీవ్రరూపం దాల్చింది. అధికారుల ప్రకారం నగరవ్యాప్తంగా వేలాది హాట్‌స్పాట్లు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో యాంటీ లార్వల్ ఆపరేషన్స్, ఫాగింగ్ సక్రమంగా జరగడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

-మిగతా 2 లో





## సెమీస్ రేసులో టీమిండియా..!

మొదటి తరువాయి

సూపర్-8లో వరుసగా రెండో మ్యాచులో ఓడిపోయిన జింబాబ్వే.. టోర్నీ సెమీస్ రేసు నుంచి నిష్క్రమించింది. లీగ్ స్టేజ్‌లో ఆస్ట్రేలియాను వెనక్కి నెట్టి.. తదుపరి రౌండ్‌కు అర్హత సాధించిన జింబాబ్వే.. సూపర్-8లో మాత్రం తేలిపోయింది. వెస్టిండీస్, భారత్ చేతిలో చిత్తుగా ఓడిపోయింది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే.. టోర్నీ సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా.. భారీ స్కోరు చేసింది. అభిషేక్ శర్మ (55), హార్దిక్ పాండ్యా (50). తిలక్ వర్మ (44), ఇషాన్ కిషన్ (38) మెరుపులతో నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. దీంతో టీ20 ప్రపంచకప్ చరిత్రలో తమ అత్యధిక స్కోరు రికార్డు బ్రేక్ చేసింది. 2007 టీ20 ప్రపంచకప్‌లో భారత్.. ఇంగ్లాండ్‌పై 218/4 స్కోరు చేసింది. ఆ మ్యాచులో యువరాజ్ సింగ్.. స్టువర్ట్ బ్రాడ్ బౌలింగ్‌లో ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు కొట్టాడు. తాజా విజయంతో భారత్.. సెమీఫైనల్ అవకాశాలను మెరుగుపర్చుకుంది. మార్చి 1న వెస్టిండీస్‌తో జరిగే మ్యాచులో టీమిండియా విజయం సాధిస్తే.. నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తుంది.

## బికినీ దుస్తుల్లోని అమ్మాయిలతో స్టీఫెన్ హాకింగ్..

మొదటి తరువాయి

కరీబియన్ దీవుల్లోని సెయింట్ థామస్‌లో హాకింగ్ పర్యటించిన ఫోటోలు ఉన్నా.. ఇప్పటి వరకు మాత్రం నేరుగా ఎప్‌స్టీన్‌తో దిగిన ఫోటో ఒక్కటి కూడా రిలీజ్ లేదు. హాకింగ్‌తో ఉన్న ఆ ఇద్దరు అమ్మాయిలు.. ఆయనకు సేవ చేసేవారని తెలిసింది. ఓ సందర్భంలో హాకింగ్ జలాంతర్గామిలో ప్రయాణించినట్లు కూడా ఫోటో ఉన్నది. అండర్‌వాటర్ వెసల్‌ను హాకింగ్ కోసం ఎప్‌స్టీన్ మార్పులు చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా రిలీజైన ఫోటోపై హాకింగ్ ఫ్యామిలీ రియాక్ట్ అయ్యింది. ఖగోళ శాస్త్రవేత్త హాకింగ్ పట్ల అనుచితంగా వ్యవహరించడం సరికాదు అని ఫ్యామిలీ పేర్కొన్నది.

## అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్న బీఆర్ఎస్

మొదటి తరువాయి

కమిషన్ల కోసమే కట్టారని పొంగులేటి ఆరోపించారు. 38 వేల కోట్లతో పూర్తి కావాల్సిన తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి, తమ రాచరికాన్ని చాటుకోవడం కోసం లక్షల కోట్లతో కాళేశ్వరం నిర్మించారు. తీరా చూస్తే ఎన్నికల ముందు ఆ ప్రాజెక్టు పేకమేడలా కూలిపోయిందని ఎద్దేవా చేశారు. గత నాలుగేళ్లలో 162 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేస్తే, అందులో 50 టీఎంసీలు తిరిగి సముద్రం పాలయ్యాయని ఆయన గణాంకాలతో వివరించారు. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ కోరినప్పటికీ, బీఆర్ఎస్ , బీజేపీల మధ్య ఉన్న అంతర్గత 'ఫెవికల్' బంధం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని మంత్రి ఆరోపించారు. కేంద్ర సంస్థల నివేదికల ఆధారంగానే తాము జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేశామని, కానీ దీనిపై అసెంబ్లీలో చర్చ జరిగే సమయంలో ప్రతిపక్ష సభ్యులు పారిపోయారని దుయ్యబట్టారు. సభలో చర్చకు రమ్మంటే కుంటిసాకులు చెప్పే బావబావమరుదులు బయట మాత్రం అచ్చోసిన ఆంబోతుల్లా రంకెలు వేస్తున్నారని పొంగులేటి ఘాటుగా విమర్శించారు. నిత్యం పెయిడ్ ఆర్టిస్టులతో సోషల్ మీడియాలో విషం చిమ్ముతూ, శవాల మీద చిల్లర ఏరుకునే రకంగా ప్రతిపక్షం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజలు వీరి నిజస్వరూపాన్ని చూశారు కాబట్టే అన్ని ఎన్నికల్లో ఓడగొట్టారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీ పడదని మంత్రి స్పష్టం చేశారు. కృష్ణా పరివాహక ప్రాంత నీటిని నల్గొండ, ఖమ్మం, మహబూబ్ నగర్ వాసులకు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ స్వార్థ నిర్ణయాల వల్ల రాష్ట్రం 15 ఏళ్లు వెనక్కి పోయిందని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని మరో 15 ఏళ్లు ముందుకు తీసుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల పనులపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రతిపక్షం దమ్ముంటే అసెంబ్లీకి రావాలని ఆయన సవాల్ విసిరారు.

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

మొదటి తరువాయి




ఒకేసారి 45 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో కలెక్టర్ల స్థాయిలో పెద్దఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం జరిగింది. మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. టీఎస్‌జీపీడీసీఎల్‌కు కొత్త సీఎండీ నియామకం జరిగింది. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులయ్యారు. బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిగానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌కుమార్, విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించారు. ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్, దేవాదాయశాఖ కమిషనర్‌గా ఎం.హనుమంతరావు, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి.దివ్యను ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు పలు జిల్లా కలెక్టర్లనూ ప్రభుత్వం బదిలీ చేసింది. యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా అనురాగ్ జయంతిని నియమించింది.పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సంజయ్ కుమార్‌ను నియమించారు. విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా దాన కిషోర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శ్రీధర్‌ను నియమించారు. ఎండోమెంట్స్ కమిషనర్‌గా హనుమంతరావుకు కొత్త బాధ్యతలు అప్పగించారు. ఫైనాన్స్ శాఖ సెక్రటరీగా గౌరవ్ ఉప్పల్‌ను నియమించారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్.శ్రీధర్‌కు బాధ్యతలు అప్పగించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా చిత్రా మిశ్రాను నియమించారు. విజయేంద్ర – మహబూబ్‌నగర్ కలెక్టర్ పదవి నుంచి సోషల్ వెల్ఫేర్ శాఖ కార్యదర్శిగా నియామకం అయ్యారు. అద్వైత్ కుమార్ సింగ్ – మహబూబాబాద్ నుంచి ఢిల్లీ తెలంగాణ భవన్ సమన్వయ శాఖకు బదిలీ అయ్యారు. సిక్తా పట్నాయక్ – నారాయణపేట్ నుంచి ఆర్థిక శాఖకు ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు. సందీప్ కుమార్ ఝా – జనగాం కలెక్టర్‌గా నియామకం అయ్యారు. ముష్రఫ్ అలీ ఫారూఖీ – టీఎస్‌జీపీడీసీఎల్ సీఎండీగా నియామకం అయ్యారు. జితేష్ వి.పాటిల్ – టీఎస్‌జీపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. స్నేహ శబరీష్ – మహబూబాబాద్ కలెక్టర్‌గా నియామకం అయ్యారు. గరిమా అగర్వాల్– రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా నియామకం జరిగింది. ప్రతిమ సింగ్ – మెదక్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అనికేత్ – భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా ,చాహత్ బజ్పాయి – హనుమకొండ కలెక్టర్‌గా,ఖుష్బూ గుప్తా – మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా , పమేలా సత్పతి – లేబర్ కమిషనర్‌గా, అనురాగ్ జయంతి – యాదాద్రి కలెక్టర్‌గా ,ప్రదీప్ జైన్ – నారాయణపేట్ కలెక్టర్‌గా నియామకం జరిగింది.

## భారతీయ విద్యాభవన్ తరహాలో స్కూళ్లు

మొదటి తరువాయి

పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి , విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా , కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని మార్గనిర్దేశం చేశారు. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌లో తప్పనిసరిగా పాలు అందజేయాలని



నిర్దేశిరచారు. ఇందుకోసం విజయా డైరీ నుంచి పాలు సేకరించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత కోసం ఏఐ టెక్నాలజీని వినియోగించాలని దిశానిర్దేశర చేశారు. కోర్ అర్బన్ రీజియన్ మినహా మిగిలిన నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కొక మండలంలో ఆరుట్ల స్కూల్ తరహాలో ట్రాన్స్‌పోర్ట్‌తో సహా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ట్రాన్స్‌పోర్ట్ కోసం ఎలక్ట్రిక్రల్ బస్సుల ఏర్పాటు పైన అధ్యాయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్స్‌లో నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దుతో పాటు రికవరీ చేసేలా నిబంధన విధించాలని హుకుం జారీ చేశారు. ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణకు సంబంధించి రికమండేషన్స్‌ని ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

### వసలదారుల పట్ల అనుసరిస్తున్న విధానంపై కోర్టు ఆగ్రహం

న్యూయార్క్,

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఆ దేశ న్యాయస్థానాల్లో వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ప్రపంచ దేశాలపై సుంకాల విషయాల ఇప్పటికే కోర్టు నుంచి వ్యతిరేక తీర్పు రాగా.. తాజాగా వలసదారుల విషయంలోనూ అదే అనుభవం ఎదురైంది. అక్రమ వలసదారులను వారికి సంబంధం లేని ఇతర దేశాలకు తరలించడాన్ని అక్కడి ఫెడరల్ కోర్టు తప్పుబట్టింది అక్రమ వలసదారుల విషయంలో ట్రంప్



కార్యవర్గం తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ మసాచుసెట్స్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి తీర్పునిచ్చారు. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులను టార్గెట్ చేసిన సంగతి తెలిసిందే. అక్రమ వలసదారులను అమెరికా నుంచి గ్వాటమాల, దక్షిణ సూడాన్, కోస్టారికా వంటి ఇతర దేశాలకు తరలించారు. దీంతో ఈ తరలింపు ముప్పును ఎదుర్కొంటున్న వలసదారులు కోర్టులో దావా వేశారు. దావాపై తాజాగా న్యాయస్థానంలో విచారణ జరిగింది. సరైన భద్రతా చర్యలు తీసుకోకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, తగిన సమయం ఇవ్వకుండా వారికి సంబంధం లేని వేరే దేశాలకు తరలించడం చట్ట విరుద్ధమని కోర్టు తీర్పునిచ్చింది . ట్రంప్ కార్యవర్గం నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు ట్రంప్ యంత్రాంగానికి 15 రోజుల సమయం ఇచ్చింది.

## ఇజ్రాయెల్-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

మొదటి తరువాయి

అంగీకరించాయి. మరోవైపు గాజాపై ప్రధాని మోదీ మరోసారి భారత్ వైఖరిని స్పష్టం చేశారు. మానవత్వం ఎప్పుడూ సంఘర్షణకు బలికాకూడదని అన్నారు. ప్రస్తుతం శాంతి ప్రణాళిక ద్వారా ఓ ముందడుగు పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతుగా నిలుస్తుందని మోదీ హామీ ఇచ్చారు. ఃూగా, త్వరలోనే భారత పర్యటనకు రావాల్సిందిగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహును ఆహ్వానించారు. అంతకు ముందు ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని నెతన్యాహు ప్రశంసించారు. ఆయన ప్రసంగం ప్రతి ఒక్కరినీ కదిలించిందని అన్నారు. భారత్‌కు రుణపడి ఉన్నామని అన్నారు. మోదీ తమకు స్నేహితుడు కంటే ఎక్కువని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇజ్రాయెల్ పర్యటన రెండు దేశాల మధ్య సరికొత్త మైత్రికి నాంది పలికింది. విమానాశ్రయం నుంచి ఇజ్రాయెల్ పార్లమెంట్ వరకు మోడీకి లభించిన ఘన స్వాగతం ఈ పర్యటన ప్రాధాన్యతను చాటిచెప్పింది. పర్యటనలో భాగంగా నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తన వ్యక్తిగత విషయాన్ని ఒకటి పంచుకొని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు మాట్లాడుతూ.. తన భార్యతో తన మొదటి డేట్ ఒక భారతీయ రెస్టారెంట్‌లో జరిగిందని, ఆ భోజనం అద్భుతంగా ఉండటం వల్లే వారి బంధం బలపడిందని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి తాను, తన పిల్లలు కూడా భారత్‌కు రుణపడి ఉంటామని ఆయన అనగానే ప్రధాని మోడీ నవ్వు ఆపుకోలేక పోయారు. భారతదేశంలోని అపారమైన ప్రతిభను, ఇజ్రాయెల్‌లోని సాంకేతిక పరిజ్ఞానాన్ని కలపడం ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చని ఇద్దరు నేతలు ఆకాంక్షించారు. ప్రధానంగా కచ్చితమైన వ్యవసాయం, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఆవిష్కరణలు, సాంకేతికత, అభివృద్ధికి సంబంధించి రెండు దేశాల మధ్య 16 కీలక అవగాహన ఒప్పందాలు జరిగాయి. రెండు దేశాల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేసేందుకు త్వరలోనే భారత్‌లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నేతలు నిర్ణయించారు. 'మా వ్యక్తిగత స్నేహం, ప్రభుత్వాల మధ్య సహకారం, ప్రజల మధ్య అనుబంధం నానాటికీ బలపడుతోంది' అని నెతన్యాహు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. దీనిని కొనసాగించేందుకు సాధ్యమైనంత త్వరగా భారతదేశంలో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పర్యటన కేవలం దౌత్యపరమైన ఒప్పందాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఇద్దరు దేశాధినేతల మధ్య ఉన్న బలమైన వ్యక్తిగత స్నేహాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది.

## దోమల బెడదతో వణుకుతున్న హైదరాబాద్






మొదటి తరువాయి

**– ఫాగింగ్ ఫలితమిస్తోందా?**

నిపుణుల అభిప్రాయం ప్రకారం ఫాగింగ్ కేవలం పెద్ద దోమలను మాత్రమే చంపుతుంది లార్వాపై ప్రభావం ఉండదు


సరైన సమయాల్లో (ఉదయం, సాయంత్రం) చేయాలి వాడుతున్న కెమికల్స్‌కు దోమలు అలవాటు పడుతున్నాయి ఒకే ఫాగింగ్ మిషన్‌తో పెద్ద పరిధిని కవర్ చేయడం సాధ్యం కాదని ఫీల్డ్ సిబ్బంది చెబుతున్నట్లు సమాచారం.

**డెంగీ ముప్పు పెరుగుతోందా?**

దోమల విపరీత పెరుగుదలతో డెంగీ, మలేరియా, చికుంగునియా వంటి వ్యాధుల ముప్పు తలెత్తే అవకాశం ఉందని వైద్య వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

ప్రస్తుతం పెద్ద ఎత్తున కేసులు నమోదు కాలేదన్న సమాచారం ఉన్నప్పటికీ, నివారణ చర్యలు విఫలమైతే పరిస్థితి అదుపు తప్పే ప్రమాదం ఉంది.

**ప్రజల డిమాండ్లు**





- ప్రతి కాలనీలో క్రమం తప్పకుండా ఫాగింగ్
- యాంటీ లార్వల్ ఆపరేషన్స్ బలోపేతం
- చెరువులు, నాలాల తక్షణ శుభ్రత
- బాధ్యులపై చర్యలు
- ప్రజలకు పారదర్శక నివేదిక

"మేము పన్నులు కడుతున్నాం... భద్రత కావాలి"

"మా ఆరోగ్యం పణంగా పెట్టొద్దు. మేము పన్నులు కడుతున్నాం. కనీసం దోమల సమస్య నుంచి రక్షణ ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత కాదా?" అని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు.

**తక్షణం స్పందించాలి**

ఇది రాజకీయ అంశం కాదు... ప్రజల ఆరోగ్య సమస్య. ప్రభుత్వం, సంబంధిత శాఖలు వెంటనే స్పందించి నగరవాసులకు ఉపశమనం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## సిగరెట్, పాన్ మసాలా వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ డిమాండ్



**కరీంనగర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరంలో సిగరెట్, పాన్ మసాలాలను ఎమ్మార్పీ ధర కన్నా ఎక్కువ రేట్లకు విక్రయిస్తున్నారని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు ఆరోపించారు. అధికారులు పట్టించుకోకపోవడం వల్ల వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి అమ్ముతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్ణయించిన ధరలకు మించి విక్రయించడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని, ఇది బ్లాక్ దందా కిందికి వస్తుందని పేర్కొన్నారు. అధికారులు వెంటనే దుకాణాలపై తనిఖీలు చేసి, అధిక ధరలకు అమ్ముతున్న వ్యాపారులపై కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## పసిపాప మరణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫార్వర్డ్ బ్లాక్ డిమాండ్




**కరీంనగర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: నాగర్‌కర్నూల్ జిల్లా కొమ్మెర గ్రామంలో పసిపాప మరణానికి కారణమైన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం అందించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. నిందితులపై మర్డర్ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని, కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఈ ఘటనపై మౌనం ఎందుకు వహిస్తున్నారో ప్రశ్నిస్తూ, సర్పంచ్ కాంగ్రెస్ పార్టీకి చెందినవారే కావడం వల్ల అరెస్టులో జాప్యం జరుగుతోందా అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజల ప్రాణాలకు విలువలేదా అని ప్రశ్నించారు.

## పల్లె చెరువు అభివృద్ధి పనుల పరిశీలన



**హుస్నాబాద్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్‌లోని ఆరేపల్లికొండాపూర్ దారిలో గల పల్లె చెరువు అభివృద్ధి పనులను గురువారం మున్సిపల్ 19వ వార్డు కౌన్సిలర్ బత్తుల స్వరూప రవీందర్ పరిశీలించారు. చెరువు కట్టను పటిష్టం చేయడానికి సిమెంట్ గోడ నిర్మాణం, ముళ్లపదలు చెట్ల తొలగింపు పనులు జరుగుతున్నాయి. గతంలో మూడు మీటర్ల వెడల్పు ఉన్న కట్టను ఆరు మీటర్ల వెడల్పుతో ఆధునీకరించడం జరుగుతుండగా, కౌన్సిలర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కట్ట ఆధునీకరణతో పాటు మట్టి రోడ్డుపైకి రాకుండా తగిన ఏర్పాట్లు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ అభివృద్ధి పనులకు రాష్ట్ర బీసీ రోడ్డు రవాణా శాఖ మంత్రి గౌరవ శ్రీ పొన్నం ప్రభాకర్ రూ. 2.79 కోట్లు నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు యువత పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు




**కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ రూరల్ పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొమ్మకల్‌కు చెందిన దుండుగోల రవి, మ్యాదరవేణి రాములు తమ ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా పట్టుబడ్డారు. బొమ్మకల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని ట్రాక్టర్లను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి తదుపరి చర్యల కోసం కోర్టుకు పంపించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# మున్సిపాలిటీ అభివృద్ధి కోసం గళంఎత్తాలన్నా బీజేపీ



**హుజురాబాద్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుజురాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ కౌన్సిలర్లు గళం విప్పాలని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి సూచించారు. గురువారం జరిగిన నూతన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రెండున్నర సంవత్సరాలుగా అధికారంలో ఉన్నా మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ఏమీ చేయలేదని అన్నారు. ప్రతిపక్ష స్థానంలో బీజేపీ కౌన్సిలర్లు ప్రజలకు బాటగా నిలిచి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా హుజురాబాద్ శివారులోని సిరసపల్లి గ్రామంలో డంప్‌యార్డ్ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మూడు ఉమ్మడి జిల్లాల చెత్తను ఇక్కడికి తరలిస్తే పట్టణ భవిష్యత్తుకే ప్రమాదమని హెచ్చరించారు. డంప్‌యార్డ్ ప్రతిపాదనను విరమించకపోతే ప్రజా పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హుజురాబాద్ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, కౌన్సిలర్లు కోలుగురి సుమలత సుమన్, దామెర అనూష, అనురాగ్ పంజాల మనోజ్, తూర్పాటి లక్ష్మి, దుర్గ రాజు, కొండ ప్రశాంతి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు, మాజీ కౌన్సిలర్లు పైళ్ల వెంకటరెడ్డి, నల్ల సుమన్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏషియన్ పెయింట్ ట్రాన్స్‌పోర్ట్ యజమానులపై
# చర్యలు తీసుకోవాలని సిపిఐ డిమాండ్




**కరీంనగర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గత ఐదు సంవత్సరాలుగా ఏషియన్ పెయింట్‌లో హమాలి పనిని ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లతో చేయించి, కూలీ డబ్బులు ఇవ్వకుండా లక్షల రూపాయలు దోపిడి చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సుంకరి సంపత్ ఆరోపించారు. ప్రతి ట్రాన్స్‌పోర్ట్ బండిపై రూ. 2,800 చొప్పున అక్రమంగా వసూలు చేస్తున్న యజమానులు గంప వెంకట్ లాజిస్టిక్, దుబ్బ భూషణం ట్రాన్స్‌పోర్ట్ యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌ను డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న కార్మికులను సమస్యలపై చర్చించకుండా, యజమానులు విదేశాల్లో ఉన్నారన్న కారణం చెబుతూ సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. కార్మిక శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కార్మికుల సంక్షేమం కోసం కాకుండా యజమానుల కోసం పనిచేస్తున్నారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కార్మిక శాఖ అధికారులు పక్షపాతం లేకుండా చర్యలు తీసుకోవాలని, అక్రమ వసూళ్లపై పోలీస్ అధికారులు కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా కార్మిక, కర్షకులను ఐక్యం చేసి సంఘటిత ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, యూనియన్ నాయకులు వెంకటేష్, వెంకట్ రెడ్డి, మూగ తిరుపతి, కే. మహేష్, ఏ. రమేష్, శ్రీనివాస్, మధు, కళాధర్, శ్రీకాంత్, విజయ్ కుమార్, రాజు, మోహన్‌తో పాటు 30 మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

## గ్రామ సభకు అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలి



**తెలకపల్లి, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలకపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఈ నెల 28వ తేదీన జరగబోయే గ్రామసభకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని గ్రామ ప్రజలు సర్పంచ్ మరియు పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బారిగారి పరమేష్ మాట్లాడుతూ, "గ్రామసభను ఉదయం 11 గంటలకు నిర్వహిస్తారని ప్రచారం చేసినా, గ్రామ ప్రజల జీవన విధానం ప్రకారం మధ్యాహ్నం సమయంలో ప్రజలు అందుబాటులో ఉండరు. కాబట్టి గ్రామసభను ఉదయం 9 గంటలకు ప్రారంభించాలి" అని డిమాండ్ చేశారు. ప్రతిసారి జరుగుతున్న గ్రామసభలో సంబంధిత శాఖల అధికారులు హాజరుకావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేపు జరగబోయే గ్రామసభకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి. మల్లేష్, ఆర్. మహేష్, ప్రేమ్ కుమార్, రెడ్డపాకుల శివశంకర్, అలాగే తెలకపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్‌కు ఘన సన్మానం



**కరీంనగర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భగత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ లైఫ్ మెంబర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ ఐఏఎస్ పదోన్నతి పొందిన సందర్భంగా ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ మేయర్, ప్రస్తుత డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు అధ్యక్షత వహించారు. ఉపాధ్యక్షులు మనోహర్, చీటి రామారావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. సభ్యులు శ్యామ్ ప్రసాద్ లాల్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ, శ్యామ్ ప్రసాద్ లాల్ ఏ పదవిలో ఉన్నా ప్రజలకు సేవలందిస్తూ మంచి మన్ననలు పొందారని, ఐఏఎస్ పదోన్నతి ద్వారా కరీంనగర్ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం రావాలని ఆకాంక్షించారు. శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, భగత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సన్మానం తనకు ఎంతో గౌరవంగా ఉందని, భగత్‌నగర్ తన సొంత ప్రాంతమని, ప్రాణం ఉన్నంతవరకు ఈ అనుబంధం కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఏ రంగంలో అవకాశం ఇచ్చినా ప్రజలకు సేవ చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి

# ఎమ్మెల్యే విజయరమణారావు



20 లక్షల నిధులతో నూతన గ్రామపంచాయతీ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయ రమణారావు



ఐదు లక్షల రూపాయల నిధులతో అంగన్వాడీ భవనం రినియేషన్ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే విజయ రమణారావు అనంతరం గర్భిణీలకు శ్రీమంత కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించడం జరిగింది.

**ఎలిగేడు, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ర్యాకల్ దేవ్‌పల్లి గ్రామంలో గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి 20 లక్షల నిధులతో శంకుస్థాపన చేసి భూమిపూజ నిర్వహించిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు. అనంతరం 5 లక్షల నిధులతో అంగన్వాడీ భవనం పునరుద్ధరణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా అనేక సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయి. గ్రామంలో జరిగే ప్రతి అభివృద్ధి పనిలో గ్రామస్తులు భాగస్వాములై నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులను నిలదీయాలి. మౌలిక వసతుల కల్పనతో పాటు గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాను" అని తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్, ఉప సర్పంచ్ బొడిగె శివకృష్ణ గౌడ్, సీడీపీఓ కవిత, సూపర్వైజర్ సూర్యకళ, అంగన్వాడీ టీచర్ ఓదేశ్వరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకుడు దుగ్యాల సంతోష్‌రావు, వార్డు సభ్యులు మడ్లపల్లి జయ, వడ్లపల్లి అనిత, ఎడ్ల సతీష్, గుడికందుల చంద్రకళ, నవీన్, ఆసంపల్లి స్వప్న, పలు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కార్పోరేటర్ మేకల వెంకటేశ్‌కు ఘన సన్మానం



**కరీంనగర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ నగరపాలక సంస్థ 6వ డివిజన్ (బొమ్మకల్) కార్పోరేటర్‌గా ఎన్నికైన మేకల వెంకటేశ్‌ను జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు కడారి అయిలన్న కురుమ ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా సన్మానించారు. వారి స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూల మొక్క అందించి, శాలువాతో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా కడారి అయిలన్న మాట్లాడుతూ, సంఘం అభివృద్ధికి మేకల వెంకటేశ్ సహకారం అందించాలని కోరగా, ఆయన తప్పకుండా సంఘం అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బీర్ల బీరయ్య కురుమ, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె రాజు కురుమ, ట్రస్ట్ అధ్యక్షుడు చిగుర్ల శ్రీనివాస్ కురుమ, ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఈరల్ల విజయ్ కుమార్ కురుమ తదితర నాయకులు పాల్గొన్నారు.

# హెల్త్ కార్డుల విషయంలో ఉపాధ్యాయుల, ఉద్యోగుల సందేహాలు నివృత్తి చేయాలి

### టీపీయూఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య




**మంచాల, ఫిబ్రవరి 26(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉపాధ్యాయులు, ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే విధివిధానాల్లో స్పష్టత అవసరమని తెలంగాణ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య అన్నారు. మంచాల మండల కేంద్రంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పీఆర్సీ అమలు చేసిన తర్వాతనే ఉపాధ్యాయుల కాంట్రిబ్యూషన్ స్వీకరించాలి, అప్పటివరకు ప్రభుత్వమే భరించాలి అని స్పష్టం చేశారు. ప్రభుత్వ వాటా కూడా ఉద్యోగుల జీతంతో పాటు చెల్లించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగులతో పాటు మోడల్ స్కూల్, గురుకుల, కేజీబీవీ, ఎస్-ఎస్ఏ ఉద్యోగులు, కాంట్రాక్ట్ మరియు అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా హెల్త్ కార్డులు వర్తింప చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్డుల ద్వారా అన్ని రకాల వ్యాధుల చికిత్సకు అవకాశం ఉంటుందా, నగదు రహిత అవుట్‌పేషెంట్ సౌకర్యం కల్పిస్తారా, ఏ నెల నుండి అమలు చేస్తారు అనే విషయాల్లో స్పష్టత ఇవ్వాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల నుండి అన్ని క్యాడర్లకు ఒకే విధంగా మినహాయింపు చేస్తారా, పెన్షనర్ల విషయంలో వాటా తగ్గించే అవకాశం ఉందా, రిటైర్డ్ సీపీఎస్ ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ సేకరణ విధానం ఎలా ఉంటుందనే అంశాలపై సమాధానం ఇవ్వాలని అన్నారు.ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కాకుండా ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేసే విధానం ఏంటి, భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగులు లేదా పెన్షనర్లు అయితే వారి కాంట్రిబ్యూషన్ విషయంలో స్పష్టత ఇవ్వాలని ఆయన సూచించారు. వీటితో పాటు ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, సీపీఎస్ ఉద్యోగులకు కరువు భత్యం వాయిదాలను తక్షణమే చెల్లించాలని, ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల మెడికల్ బిల్లులు, జీపీఎఫ్ లోన్లు, సరెండర్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.పీఆర్సీ ని తక్షణమే అమలు చేయాలని, పదవ తరగతి పరీక్ష విధులు నిర్వహించే ఇన్విజిలేటర్ల రెమ్యునరేషన్ పెంచి, స్పాట్ డబ్బులు వెంటనే చెల్లించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కోట్ల కాశిరావు, పూజారి రమేశ్, రాష్ట్ర మీడియా కో కన్వీనర్ సత్తారి రాజిరెడ్డి, జిల్లా బాధ్యులు జిల్కపల్లి కరుణాకర్ రెడ్డి, పట్నం కృష్ణ, మంచాల మండల అధ్యక్ష కార్యదర్శులు రావుల శివకుమార్, దత్తాత్రేయ, చీర బాలరాజు పాల్గొన్నారు.

## టీచర్లకు పీఎం శ్రీ ఐడి కార్డుల పంపిణీ



**కరీంనగర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్థానిక పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ధన్గర్ వాడి ఉపాధ్యాయులకు ఐడి కార్డులను ప్రధానోపాధ్యాయురాలు జి. ప్రమోద గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పీఎం శ్రీ నిధులతో పాఠశాలలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వాటిలో భాగంగానే ఉపాధ్యాయులకు గుర్తింపు ఐడి కార్డులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఇది ఉపాధ్యాయుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని, ఇదే స్ఫూర్తితో విద్యార్థులకు కూడా ఐడి కార్డులు అందించే ప్రయత్నం జరుగుతుందని పేర్కొన్నారు.

## రక్తదానం చేసి ప్రాణాలు కాపాడుదాం



**కరీంనగర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** సిరిసిల్ల జిల్లా రామగిరి గ్రామానికి చెందిన రాకేష్, కరీంనగర్‌లోని వన్ ప్రైవేట్ ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ నిమిత్తం అత్యవసరంగా రక్తం అవసరమైన సందర్భంలో 29వ సారి రక్తదానం చేశారు.కరీంనగర్ జిల్లా దుర్గయ్య (80) గుండె శస్త్రచికిత్స కోసం బీ నెగటివ్ రక్తం అవసరమైన సమయంలో, రిప్లేస్‌మెంట్ కింద రాకేష్ తన ఏ పాజిటివ్ రక్తాన్ని అందించారు. గత 10 సంవత్సరాలుగా అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి అనేక ప్రాణాలను కాపాడుతున్నందుకు ఆయనను సోషల్ ఆక్టివిస్టులు గాలిపెల్లి కుమార్, సమాజ సేవకులు తుమ్మరాజ్ కుమార్, వరికిల్లా దినేష్ అభినందించారు.ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు తమ పుట్టినరోజు, పెళ్లిరోజు, శుభకార్యాల సందర్భాల్లో రక్తదానం చేసి విలువైన ప్రాణాలను కాపాడాలని కోరారు.

## ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



**కరీంనగర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరంలోని ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస దీక్షను విరమించి, వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణ, దాతృత్వం, మత సామరస్యానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ భీంరావు, ఏసీపీ ట్రాఫిక్ యాదగిరిస్వామి, ఏసీపీ రూరల్ విజయకుమార్, ట్రాఫిక్ విభాగం సిబ్బంది, స్థానిక ముస్లిం సోదరులు పాల్గొని మతసామరస్యాన్ని చాటారు.

## అభిరామ్‌కు జయహో జనతా జవాన్ ఫౌండేషన్ సమక్షంలో ఘన సన్మానం



**కరీంనగర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మన కరీంనగర్ ముద్దుబిడ్డ అక్కినపెల్లి అభిరామ్ రిపబ్లిక్ డే క్యాంప్కి ఎంపికైన సందర్భంగా జయహో జనతా జవాన్ ఫౌండేషన్ వారు జ్ఞాపిక అందించి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు అమనగంటి విక్రమ్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే అభిరామ్ దేశభక్తి, క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర శ్రమకు నిదర్శనమని అన్నారు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి సమక్షంలో రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనడం కరీంనగర్ జిల్లాకే కాకుండా తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో దేశానికి మంచి అధికారి అవ్వాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు మారెళ్ల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి మరిమడ్ల మల్లేశం, గౌరవ అధ్యక్షుడు అడ్డగుంట మల్లయ్య, సభ్యులు శ్రీపతి పాల్గొన్నారు.

# ఆసియా పారా గేమ్స్ ఎంపిక కమిటీ సభ్యుడిగా సింగారపు బాబు



**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్రానికి మరో గౌరవం దక్కింది. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి గ్రామానికి చెందిన అంతర్జాతీయ పారా సిట్టింగ్ వాలీబాల్ కోచ్ సింగారపు బాబు 2026 ఆసియా పారా గేమ్స్ భారత జట్టు ఎంపిక కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. జపాన్‌లోని ఐచినగోయాలో జరగనున్న ఆసియా పారా గేమ్స్ కోసం భారత జట్టును ఎంపిక చేసే సాంకేతిక పరిశీలకుడు మరియు ఎంపిక కమిటీ సభ్యుడిగా పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా ఆయనను అధికారికంగా నియమించింది. 2026 ఫిబ్రవరి 2628 మధ్య జరిగే 14వ జాతీయ పారా సిట్టింగ్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ సందర్భంగా ఆసియా పారా గేమ్స్‌కు భారత జట్టు ఎంపిక ప్రక్రియ చేపడతారు. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి సమర్థమైన జట్టును రూపొందించే బాధ్యత ఎంపిక కమిటీకి అప్పగించారు. మారుమూల గ్రామం నుండి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి దేశానికి సేవ చేయడం రాష్ట్ర క్రీడా రంగానికి గర్వకారణమని, ఆయన నియామకం యువతకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ బాధ్యతను అప్పగించిన పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియాకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో మరింత కృషి చేస్తానని సింగారపు బాబు తెలిపారు.

# కలెక్టరేట్ ఎదుట బీఎంఎస్ నిరసన




**కరీంనగర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా జరిగింది. జిల్లా అధ్యక్షుడు పసుల శ్రవణ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్మిక చట్టాల అమలులో నిర్లక్ష్యం, కనీస వేతనాల పెంపు లేకపోవడం, కార్మికుల సామాజిక భద్రతా హక్కుల పరిరక్షణలో లోపాలు వంటి అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా పసుల శ్రవణ్, తొర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ బీడీ కార్మికుల వేతనాలు పెంచాలని, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఈపీఎస్ 95 పెన్షనర్లకు రూ.7,500 పెంచాలని, కరీంనగర్‌లో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో బీడీ కార్మికులు, రైస్ మిల్ కార్మికులు, స్ట్రీట్ వెండర్లు, బీఎంఎస్ కార్యకర్తలు, రాష్ట్ర కార్యదర్శి రేణికుంట శంకర్, నక్క అరుణ్, ఆకుల తిరుపతి, మధుకర్, రాజేశం, సుమతి, స్వప్న, అనసూర్య, లక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.

# లీడ్ బ్యాంకు మేనేజర్‌కు ఘన సన్మానం



**కరీంనగర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఈనెల 28న లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకట సీతా రామాంజనేయులు ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కేడిసిసిబి కార్యాలయంలో సన్మాన కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో లీడ్ బ్యాంకు మేనేజర్ అందించిన సేవలు విశేషమని, ప్రభుత్వ శాఖల అధికారులు, బ్యాంకర్లను సమన్వయ పరచడంలో ఆయన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లాలో రుణాల పంపిణీ వార్షిక ప్రణాళిక రూపొందించడం, రుణ పంపిణీ పర్యవేక్షణలో ఆయన చేసిన సేవలు ప్రత్యేకమని అన్నారు. బ్యాంకింగ్ సేవలలో ఖాతాదారులకు ఎదురైన సమస్యలను పరిష్కరించడంలో, వివిధ ప్రభుత్వ పథకాల అమలులో ఆయన కృషి గుర్తించదగినదని కలెక్టర్ అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో వివిధ బ్యాంకింగ్ రంగాలకు చెందిన అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలి

**-- అండేకార్ యాదిలాల్**



**ఆమనగల్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అలంపూర్ నుండి చలో సెక్రటేరియట్ ముట్టడి కోసం పాదయాత్ర చేస్తున్న అలంపూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులను గురువారం ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ పాలమాకుల వద్ద కలిశారు. పాదయాత్ర చేస్తున్న న్యాయవాదులను పూలమాలలు, శాలువాలతో సత్కరించిన ఆయన మాట్లాడుతూ, “న్యాయవాదుల రక్షణ చట్టం అమలు జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది” అని స్పష్టం చేశారు. అదేవిధంగా కల్వకుర్తి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో చేపట్టిన రిలే నిరాహార దీక్షను ఆమనగల్ న్యాయవాదులతో కలిసి సందర్శించి సంఘీభావం తెలిపారు. కల్వకుర్తి బార్ అసోసియేషన్ దీక్షకు ఆమనగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తమ పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు, కల్వకుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, లక్ష్మణ శర్మ, మల్లేపల్లి జగన్, చిందం కృష్ణయ్య, వెంకట్ గౌడ్, ఆంజనేయులు, రామకృష్ణ, శివకుమార్, జంగయ్య, ప్రశాంత్, శ్రీకాంత్, మధు, కృష్ణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట పురపాలక సంఘం బడ్జెట్ ఆమోదం



**సిద్దిపేట, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిద్దిపేట పురపాలక సంఘం 2026--27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.181.99 కోట్ల అంచనాల బడ్జెట్‌ను ఆమోదించింది. జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా హాజరైన ఈ సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ కడవెర్గు మంజుల రాజనర్సు, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఆధ్వర్యంలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకట్రావ్ బడ్జెట్ వివరాలు ప్రవేశపెట్టగా, కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. 2026--27 సంవత్సరానికి మొత్తం ఆదాయం రూ.181 కోట్లు 99 లక్షల 50 వేలుగా అంచనా వేయగా, వ్యయం రూ.181 కోట్లు 93 లక్షలు. మిగులు రూ.6.10 లక్షలు. సాధారణ ఆదాయం రూ.52.96 కోట్లు, సాధారణ వ్యయం రూ.52.93 కోట్లు కేటాయించారు. వీటిలో వెనుకబడిన మురికివాడలు, విలీన గ్రామాల అభివృద్ధికి రూ.2.73 కోట్లు కేటాయించారు. అదనంగా, సాధారణ బడ్జెట్‌లో 10 శాతం అయిన రూ.5.29 కోట్లు హరిత బడ్జెట్‌కు కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ, మున్సిపాలిటీ ఆదాయ--వ్యయాలను సమగ్రంగా ప్రతిపాదించడం జరిగిందని, ప్రభుత్వ ఆమోదం కోసం పంపనున్నట్లు తెలిపారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన మున్సిపల్ చైర్పర్సన్, పాలకవర్గ సభ్యులు, అధికారులు అభినందనీయులని పేర్కొన్నారు.

# బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

**- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**

**మానకొండూర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తిమ్మాపూర్ మండలం నల్లగొండ గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలను ధర్మకర్తలు, అధికారులు సమన్వయంతో నిర్వహించి విజయవంతం చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. గురువారం ఆయన ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్మించిన ప్రహారీ గోడను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బండారుపలెల్లి లక్ష్మణ్, కార్యనిర్వాహణాధికారి






నాగుల అనిల్ కుమార్, ధర్మకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. గంగాధర మండలం చిన్న ఆచంపల్లి గ్రామంలోని శ్రీ సీతారామాలయంలో నవగ్రహ ధ్వజస్తంభ శిఖరం ప్రతిష్ఠ మహోత్సవానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, జిల్లా కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. డిజిటల్ విప్లవంతో మారిన ప్రపంచ గతి కరీంనగర్ ఆదర్శనగర్‌లో వి. సాయి సుమంత్ రూపొందించిన పల్లె యాప్‌ను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్నెట్ వల్ల ప్రపంచమే కుగ్రామంగా మారిపోయిందని, స్థానిక, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విద్య, ఉద్యోగావకాశాలు, వ్యాపార సమాచారాన్ని పల్లె యాప్ ద్వారా అందించడం శుభపరిణామమని అన్నారు. తరువాత కరీంనగర్‌లోని కొండ సత్యలక్ష్మి గార్డెన్స్‌లో జరిగిన వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టాలంటే అవగాహన అవసరం

**సీపీ గౌష్ ఆలం**

**హుజురాబాద్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రోడ్డు ప్రమాదాల నివారణ కేవలం పోలీసుల చర్యలతోనే సాధ్యం కాదని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనల పట్ల పూర్తి అవగాహన కలిగి వాటిని బాధ్యతాయుతంగా పాటించినప్పుడే ప్రమాద రహిత సమాజం సాధ్యమవుతుందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం సింగపూర్ కిట్స్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ‘అరైవ్--అలైవ్’ అవగాహనా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఏడాది కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల వల్ల 200 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, వీటిలో ఎక్కువ శాతం సీట్‌బెల్ట్, హెల్మెట్ వినియోగం లేకపోవడం, అతివేగం, మద్యం సేవించి వాహనం




నడపడం వంటి మానవ తప్పిదాల వల్లే జరిగాయని తెలిపారు. ప్రమాదాల్లో మరణించిన వారిలో 85 శాతం మంది పురుషులే ఉండటం గమనార్హమని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్--హైదరాబాద్, వరంగల్, జగిత్యాల, సిరిసిల్ల, చొప్పదండి రహదారుల్లో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్న బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ ప్రత్యేక నిఘా, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర డీజీపీ ప్రారంభించిన అరైవ్--అలైవ్ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ పరిసరాలను గమనిస్తూ వాహనం నడిపే ‘డిఫెన్సివ్ డ్రైవింగ్’ అలవరచుకోవాలని సూచించారు. విద్యార్థులందరితో రోడ్డు భద్రత నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పోలీసులకు సహకరించిన ఎన్‌సిసి క్యాడెట్లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి రోడ్డు ట్రాన్స్పోర్ట్ శాఖ సమన్వయంతో లెర్నింగ్ లైసెన్స్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ వేణు, ఏసీపీ మాధవి, ఇన్స్పెక్టర్ కరుణాకర్, కళాశాల ప్రిన్సిపాల్ కె. శంకర్, ఎస్సైలు శేఖర్ రెడ్డి, స్వాతి కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శాతవాహన న్యాయ కళాశాలలో అమెరికా న్యాయరంగ అవకాశాలపై అవగాహన




**కరీంనగర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శాతవాహన విశ్వవిద్యాలయ న్యాయ కళాశాల సెమినార్ హాల్లో అమెరికా న్యాయరంగ అవకాశాలపై ప్రత్యేక అవగాహనా సదస్సు జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అమెరికా ఇమ్మిగ్రేషన్ అటార్నీ జనతా రెడ్డి కంచర్ల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.జనతా రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక నైపుణ్యాలను పెంపొందించుకున్న విద్యార్థులకు అమెరికాలో న్యాయరంగంలో పుష్కల అవకాశాలు ఉన్నాయని, లీగల్ కోడింగ్ ద్వారా ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరచుకోవచ్చని తెలిపారు. విద్యార్థులతో చర్చిస్తూ ప్రస్తుత ఇమ్మిగ్రేషన్ ధోరణులపై అవగాహన కల్పించారు.విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ నాణ్యమైన న్యాయవిద్య అందరికీ అవసరమని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువు పూర్తి చేసి ఉన్నత విద్య కోసం అమెరికా వంటి దేశాలకు వెళ్లి తమ అవకాశాలను పెంచుకోవాలని సూచించారు.తెలంగాణ గ్లోబల్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, రిజిస్ట్రార్ సతీష్ కుమార్, గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ అమెరికా అధ్యక్షుడు విశ్వేశ్వర్ రెడ్డి కూడా ప్రత్యేక అతిథులుగా పాల్గొని విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించారు. అమెరికాలో ఉపాధి అవకాశాల కోసం తెలంగాణ అభ్యర్థులకు ఉచిత సలహాలు, సహకారం అందిస్తున్నామని విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యాయశాఖ అధ్యాపకులు, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని అమెరికా అవకాశాలపై మెలకువలు పొందారు.

# వికసిత్ భారత్ 2026 పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి బండి సంజయ్




**కరీంనగర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2026 పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను సెంట్రల్ మినిస్టర్ బండి సంజయ్ విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని అత్యవసర పరిస్థితులపై తమ అభిప్రాయాలను రాజ్యాంగబద్ధంగా వ్యక్తపరచాలని సూచించారు. 50 ఇయర్స్ ఆఫ్ ఎమర్జెన్సీ: లెసన్స్ ఫర్ ఇండియన్ డెమోక్రసీ అనే అంశంపై మూడు నిమిషాల పాటు హిందీ, ఇంగ్లీష్, తెలుగు భాషల్లో మాట్లాడే అవకాశం కల్పించబడిందని తెలిపారు.జిల్లా స్థాయి పోటీలు ఫిబ్రవరి 28న ఎస్ఆర్ఆర్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపల్ కె. రామకృష్ణ వివరించారు. పోటీలో పాల్గొనేవారు ముందుగా మై భారత్ పోర్టల్‌లో వికసిత్ భారత్ ఈవెంట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. టిజిసి జిటిఏ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కడారు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను నిస్సంకోచంగా వ్యక్తపరచి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మేరా యువ భారత్ జిల్లా అధికారి వెంకట రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి కరీంనగర్ జిల్లా పేరు ప్రఖ్యాతులను జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి. నితిన్ పాఠక్, టి. రాజయ్య, సమన్వయకర్త బి. ఎలిజబెత్ రాణి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ పిఓలు శ్రీనివాస్ రెడ్డి, సత్య ప్రకాష్, కే. అర్జున్, వెంకటేశ్వర్లు, రాజేందర్ రాజేష్ తదితరులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

# వైద్యవిద్య అనంతరం ప్రజాసేవకు అంకితం కావాలి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి






**నల్లగొండ, ఫిబ్రవరి 26 నీలగిరి ( ఎక్స్ ప్రెస్):**
గురువారం నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న 35 మెడికల్ కళాశాలల్లో నల్లగొండ మెడికల్ కళాశాలను ఉత్తమంగా అభివృద్ధి చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో నిర్మాణం స్లాబ్ స్థాయిలో ఆగిపోవడంతో రూ.85 కోట్లు కేటాయించి పనులు పూర్తి చేసి కళాశాలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 350 మంది విద్యార్థులు చదువుతున్న ఈ కళాశాలకు రవాణా సౌకర్యం కోసం ప్రత్యేకంగా రెండు బస్సులను నెలలోనే ప్రారంభిస్తామని ప్రకటించారు. విద్యార్థులు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. విద్య పూర్తి అనంతరం మానవత్వంతో వైద్య సేవలు అందించాలని విద్యార్థులకు సూచిస్తూ, నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ను మోడల్ సిటీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి , అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్ , వైద్య కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రవీంద్రభారతిలో ఘనంగా మరుగుజ్జుల సంఘం 25వ రజతోత్సవం



**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రవీంద్రభారతిలో గురువారం మరుగుజ్జుల సంఘం 25వ రజతోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, పీర్జాదిగూడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి తదితరులు హాజరయ్యారు.కార్యక్రమంలో మాట్లాడిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, "దివ్యాంగుల కోసం కేంద్ర ప్రభుత్వం తరపున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తాం" అని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ, "మరుగుజ్జు అన్న పదాన్ని వాడకూడదు. వారికి గౌరవప్రదమైన పదాన్ని ప్రభుత్వం గుర్తించి కేటాయించాలి" అని సూచించారు.తుంగతుర్తి రవి మాట్లాడుతూ, "ఇంత గొప్ప కార్యక్రమానికి ఆహ్వానించినందుకు నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు. గతంలో పైచదువులు చదివిన దివ్యాంగులకు మాత్రమే వాహనాలు, ల్యాప్‌టాప్‌లు ఇచ్చేవారు. ప్రస్తుత ప్రజాపాలనలో చదువుతో సంబంధం లేకుండా అర్హులైన వికలాంగులందరికీ వాహనాలు అందిస్తున్నారు. బడ్జెట్ అనంతరం పింఛన్‌ను ?4016 నుండి ?6016కి పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని తెలిపారు.బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో ఉన్న దివ్యాంగులు తమ సమస్యలపై ఎప్పుడైనా తనను కలవవచ్చని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జాతీయ దివ్యాంగుల నాయకులు జవాబు శ్రీనివాస్, కొల్లి నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్, రాష్ట్ర నాయకులు గుత్తికొండ కిరణ్, తుడుం రాజేందర్, జెన్నరాజు, గిద్దే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనరేట్ సమక్షంలో డ్రైవర్ల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం




**జమ్మికుంట, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో డ్రైవర్లందరికీ ఉచిత కంటి వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అరైవ్ అలైవ్" సురక్షిత రహదారి ప్రయాణం కార్యక్రమంలో భాగంగా గురువారం జమ్మికుంటలోని వినాయక ఫంక్షన్ హాల్‌లో ఈ శిబిరం జరిగింది.రోడ్డు భద్రతలో డ్రైవర్ల కంటి చూపు అత్యంత కీలకమని, ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ డ్రైవర్లు తమ ఆరోగ్యంతో పాటు కంటి చూపును ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని, స్పష్టమైన చూపు లేకపోవడం వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టడమే ఈ శిబిరం ఉద్దేశమని పేర్కొన్నారు. జమ్మికుంట మరియు పరిసర ప్రాంతాల ఆటో, క్యాబ్, లారీ, బస్సు డ్రైవర్లతో సహా దాదాపు 500 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట ఇన్స్పెక్టర్ రామకృష్ణ, హుజురాబాద్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, వెంకట్, లక్ష్మీనారాయణ, ఎస్సైలు శేఖర్ రెడ్డి, నాగరాజు, స్వాతి, సతీష్, కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తిమ్మారెడ్డి గూడెంలో ఇందిరమ్మ ఇళ్ళు, సీసీ రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





**వేములపల్లి, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వేములపల్లి మండలం తిమ్మారెడ్డి గూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారులైన సూర్యపెల్లి జ్యోతి శ్రీను కుటుంబానికి కేటాయించిన నూతన ఇల్లు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.తరువాత గ్రామంలో సీసీ రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, గ్రామ కార్యదర్శి, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రతి పల్లె అభివృద్ధి చెందడమే లక్ష్యం

-- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పునరుద్ఘాటించారు. మండల పరిధిలోని అన్నారం గ్రామంలో పర్యటించిన ఆయన గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కీలక పనులకు శ్రీకారం చుట్టారు.గ్రామ సర్పంచ్ లావణ్య రామకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం ద్వారానే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామాల సమగ్ర వికాసం కోసం నిరంతరం శ్రమిస్తానని హామీ ఇచ్చారు.తదుపరి గ్రామంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పనులను నాణ్యతతో, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులను కలిసి వారికి శుభాకాంక్షలు తెలుపుతూ నూతన వస్త్రాలను అందజేశారు. స్వంత ఇంటి కల నెరవేరుతున్న తరుణంలో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో గ్రామస్తులు, పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**మనోహరాబాద్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తరగతుల్లో పాఠాలను బోధించారు.కార్యక్రమంలో విద్యార్థులు ఆర్జేడీ హర్ష వర్ధన్, డీఈవో హాసిని, డీ.డీఈవో నిఖిత, ఎంఈవో హారిక గౌడ్, హెచ్ఎం అక్షర పాత్రలను పోషించారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా విద్యార్థులు పరిపాలన, బాధ్యత, నాయకత్వం వంటి అంశాలను అనుభవించారు.ప్రధానోపాధ్యాయులు వెంకట స్వామి విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మహబూబాబాద్ కలెక్టర్‌గా స్నేహ శబరీష్ నియామకం



**మహబూబాబాద్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తెలంగాణ భవన్ స్పెషల్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హనుమకొండ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న స్నేహ శబరీష్‌ను మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన స్నేహ శబరీష్ గతంలో కొమురంభీమ్ ఆసిఫాబాద్, హనుమకొండ జిల్లాల్లో కలెక్టర్‌గా సేవలందించారు. ప్రస్తుతం మహబూబాబాద్ ఎస్పీగా పనిచేస్తున్న శబరీష్ సతీమణి కావడం విశేషం.

# రోడ్డు భద్రత - మన అందరి బాధ్యత



**మహబూబాబాద్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ పి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, టౌన్ డీఎస్పీ తిరుపతిరావు సూచనల ప్రకారం "అరైవ్ అలీవ్ 2026" కార్యక్రమం రెండో దశలో భాగంగా టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా టౌన్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ, వారం రోజుల పాటు జరిగే రెండో దశ కార్యక్రమంలో లైన్ డ్రైవింగ్, సురక్షిత ఓవర్‌టేకింగ్, హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ తప్పనిసరి, మద్యం సేవించి వాహనం నడపడం పై కఠిన చర్యలు, భారీ వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు, రక్షణాత్మక డ్రైవింగ్ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.ఈ రోజు ప్రత్యేక కార్యక్రమంలో సుమారు 60 మంది డీసీఎం మరియు ఆటో డ్రైవర్లకు స్థానిక శ్రీ మహాలక్ష్మి ఐ హాస్పిటల్‌లో డాక్టర్ కాలేరు సత్యనారాయణ ద్వారా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా, టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్లో 50 మంది డ్రైవర్లకు రక్షణాత్మక డ్రైవింగ్ పై అవగాహన కల్పించారు.వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించి తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతకూ సహకరించాలని ఆయన కోరారు. రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కలిసిన మహబూబాబాద్ రైల్వే మెగా సాధన కమిటీ



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సికింద్రాబాద్ రైల్వే నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీనివాస్ మల్లాడిని మహబూబాబాద్ రైల్వే మెగా ఫ్రెయిట్ మెయింటెనెన్స్ డిపో సాధన కమిటీ బాధ్యులు కలిసి మహబూబాబాద్‌లోనే డిపో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జనరల్ మేనేజర్ సానుకూలంగా స్పందించి, రైల్వే బోర్డు ఆమోదానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం మెగా డిపో ఏర్పాటుకు సంబంధించి ఉచిత స్థలాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. మహబూబాబాద్‌లో అధికంగా గిరిజన జనాభా ఉండటం, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల ఈ డిపో ఏర్పాటు అత్యవసరమని సాధన కమిటీ వివరించింది.మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు ప్రొఫెసర్ అజ్మీరా సీతారామ్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో డిపో సాధన కమిటీ బాధ్యులు డాక్టర్ డోలి సత్యనారాయణ, మైస శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధ్యక్షులు వల్లబు వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ ఫరీద్, రజక సంఘం నాయకులు దుగ్గి గోపాల్, టీపీజేఏసీ నాయకులు బుర్ర గోవర్ధన్ పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చీబ్‌ను వెంటనే విడుదల చేయాలి

- మహబూబాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్



**మహబూబాబాద్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహబూబాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భూక్యా వెంకటేష్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అజ్మీర సురేష్ నాయక్, "యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చీబ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేయడం తీవ్రంగా ఖండించదగిన విషయం. ఏఐ సమ్మిట్‌లో శాంతియుత నిరసన తెలిపినందుకు ఆయనతో పాటు మరో ఏడుగురిని అరెస్టు చేసి పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం రాజ్యాంగ విరుద్ధం. ప్రతి పౌరుడికి శాంతియుత నిరసన తెలిపే హక్కు ఉంది. ఉదయ్ భాను చీబ్‌ను వెంటనే విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ, "కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ప్రజల పక్షాన మాట్లాడే కాంగ్రెస్ నాయకులపై క్రిమినల్ కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతోంది. మోడీ ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి, ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్నవాటిని కూడా తొలగించే ప్రయత్నం చేస్తోంది. భవిష్యత్తులో బీజేపీకి తగిన గుణపాఠం చెబుతాం" అని మండిపడ్డారు.తదుపరి యూత్ కాంగ్రెస్ తరపున మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన కౌన్సిలర్లకు సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో రెండో వార్డు కౌన్సిలర్, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి అంబాల శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బుడగ వెంకటేశ్వర్లు, జరుపుల విజయకుమార్, టౌన్ అధ్యక్షుడు గాడిపెల్లి చరణ్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టం రాము, ఉబ్బేపల్లి శ్రావణ్, ఆవుల సురేష్ యాదవ్, ధార రాజేష్ నాయక్, యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గండు కార్తీక్ గౌడ్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఖాజా బాషా, కో కన్వీనర్ రాజేష్ నాయక్, దంతాలపల్లి మండల అధ్యక్షుడు సంపేట సురేష్, కేసముద్రం మండల అధ్యక్షుడు గొల్లపల్లి మహేందర్, కేసముద్రం నాయకులు ఎండి రియాజ్, అంబాల ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా మిత్రులు పాల్గొన్నారు.

# ఫామ్ అయిల్ సాగు రైతులకు భరోసా

**-మేలైన పద్ధతులతో అధిక దిగుబడులు**

**-మూడేళ్ల నుండి మొదలుకొని 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుంది**

**-భూసారాన్ని పరిరక్షిస్తూ గో ఆధారిత వ్యవసాయం కొనసాగించడం అభినందనీయం**

**-రైతు సత్యనారాయణ రావును ఆదర్శంగా తీసుకోవాలి**

**- రైతులు పకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి**

**-వరంగల్ జిల్లా ఉధ్యానవన అధికారి శ్రీనివాస్ రావు**





**వర్ధన్నపేట, ఫిబ్రవరి 26(నీలగిరి ఎక్స్ ప్రెస్): :** పామ్ ఆయిల్ పంట సాగుచేస్తున్నమంటే పాడి గేదేను పెంచడం లాటిందని, ఆయిల్ ఫామ్ సాగు రైతులకు భరోసా కనిపిస్తుందని వరంగల్ జిల్లా ఉధ్యానవన అధికారి శ్రీనివాస్రావు అన్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని ఎమ్మార్సీబీ చైర్మన్, డా.తక్కళ్లపల్లి సత్యనారాయణ రావు ఆయిల్ ఫామ్ క్షేత్రంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇల్లంద రైతు ఆయిల్ ఫామ్ ను క్షేత్రస్థాయిలో వచ్చిన రైతులతో సందర్శించిన అనంతరం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా ఆయిల్ ఫామ్ లో అధిక దిగుబడులు సాధించవచ్చున్నారు.నీళ్లు అధికంగా పెట్టడం వల్ల పంటను రైతులు నష్ట పోయే ప్రమాదం ఉందన్నారు.రోజుకు 200 లీటర్ల నీళ్లు ఇస్తే సరిపోతుం దన్నారు. ఉద్యాన పంటల్లో ఒకటైన ఆయిల్ ఫామ్ సాగు జిల్లాలో 7 వేల ఎకరాల్లో సాగవుతోందని వెల్లడించారు. మండలంలో 9వందల ఎకరాల్లో పంట సాగువుతందని తెలిపారు.మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా ఆయిల్ ఫామ్ లో అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు వరంగల్ జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాసరావు. తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ పంట దిగుబడి సాధించే దిశగా రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, సస్యరక్షణ చర్యలు, గో ఆధారిత ఎరువు తయారీ తదితర అంశాలపై రైతులకు వివరించారు. ఆయిల్ ఫామ్ నాటిన మూడేళ్ల నుండి మొదలుకొని 30 ఏళ్ల వరకు దిగుబడును తీసుకోవచ్చని శ్రీనివాసరావు వెల్లడించారు. ఎకరాకు 10 టన్నుల దిగుబడి వస్తుందన్న ఆయన ఆయిల్ ఫామ్ సాగులో మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధిస్తున్నట్లు వివరించారు. రానున్న రోజుల్లో ఆయిల్ ఫామ్ సాగు కు మరింత ఆదరణ పెరగనున్నట్లు ఈ సందర్భంగా శ్రీనివాస రావు స్పష్టం చేశారు.ఆధునిక రసాయన ఎదవులను పక్కనపెట్టి.... సత్యనారాయణ సేంద్రీయ., గో ఆధారిత వ్యవసాయానికి నాంది పలికారు. భూసారాన్ని పరిరక్షిస్తూ గో ఆధారిత వ్యవసాయం కొనసాగించడం అభినందనీయమన్నారు. రైతు తక్కళ్లపెల్లి సత్యనారాయణ రావు మాట్లాడుతూ నేను యూట్యూబ్లో ఆయిల్ ఫామ్ సాగు గురించి చూసి నాకున్న నాలుగు ఎకరాలలో మూడు సంవత్సరాల క్రితం ఆయిల్ ఫామ్ మొక్కలు నాటడం జరిగిందన్నారు. అయితే నేను ఆయిల్ ఫామ్ సాగు మొదలుపెట్టినప్పుడు నన్ను కొంతమంది అపహాస్యం చేశారని, అయినా నేను వెనకడుగు వేయలేదని అన్నారు. అంతేకాకుండా రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువులు మాత్రమే వినియోగిస్తున్నానని తెలిపారు.ఆయిల్ ఫామ్ మొక్క ఒకసారి నాటితే 30 ఏళ్ల వరకు దిగుబడిస్తుందని , పశు వులఎరువు,సహజ సిద్ధ ఎరువులు వాడాలని చెప్పారు .తను మూడు సంవత్సరాలుగా ఆయిల్ ఫామ్ సాగు కోసం చేసిన మెలకువలను రైతులకు క్లుప్తంగా వివరించారు. అదేవిధంగా ఆయిల్ పామ్ లో కూలీలకు కొరత ఉండదని ఒక ఎకరానికి నికరంగా 10 టన్నుల దిగుబడి వస్తుందని రైతులతో తన అనుభావలను పంచుకున్నారు.

**మండల వ్యవసాయ అధికారి విజయకుమార్ మాట్లాడుతూ**

రైతు తక్కల్లపల్లి సత్యనారాయణ రావు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించే దిశగా అడుగులు వేయడం అభినందనీయమన్నారు.ముఖ్యంగా దుక్కిలో వేసే డీఏపీ వంటి ఎరువులు మోతాదుకు మించి వేయడం వల్ల గాలి, నీరు కాలుష్యమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు.యూరియా వాడకం తగ్గించడం, సేంద్రియ ఎరువుల వాడకం, పంట సాగులో తీసుకోవలసిన మెళకువలు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఇల్లంద గ్రామ సర్పంచ్ బేతి సాంబయ్య,ఉపసర్పంచ్ బొచ్చు జ్యోతి యాదగిరి ,వార్డు మెంబర్లు, మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ ,మండల ఉధ్యానవన అధికారి రాకేశ్ ,రామ్ చరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ సతీష్ నారాయణ రైతులు,తదితురులు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీ అధికారుల సహకారంతో నిండిన కుండల మారిన చెరువు





**పాలకుర్తి, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: పాలకుర్తి మండలంలోని చెరువులు భవిష్యత్తులో ఎండిపోకుండా, ఎల్లప్పుడూ నిండుగా ఉండేలా చర్యలు తీసుకుంటామని రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్ తెలిపారు. పదిహేను రోజుల క్రితం పూర్తిగా ఎండిపోయిన పాలకుర్తి గ్రామ చెరువులోకి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ చొరవతో ఎస్సారెస్పీ అధికారుల సహకారంతో నీటిని మళ్లించారు. దీంతో చెరువు నిండు కుండలా మారి గ్రామానికి జలకళను తీసుకువచ్చింది. గురువారం మనాలి ఠాకూర్ చెరువుకు పసుపు, కుంకుమ, పూలతో ప్రత్యేక పూజలు చేసి హారతులు అర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చెరువు నిండడంతో గ్రామంలో భూగర్భజలాలు పెరిగి బోర్లు, వ్యవసాయం, పశువులకు నీటి ఎద్దడి లేకుండా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామస్థుల కోరిక మేరకు చెరువును నిండు కుండలా మార్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దపల్లి తిరుమల ఆజిమల్లు, ఉపసర్పంచ్ ఐద బుగ్గరామస్వామి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, మెరుగు అశోక్ గౌడ్, మాజీ ఎంపీపీ గంగాధర రమేష్, సూర సమ్మయ్య, తలారి శంకర్, చిలగాని రాజేష్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజాబాట




**పాలకుర్తి, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండల కేంద్రంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి బసంత్‌నగర్ ఏఈ మానాల ప్రసాద్ గురువారం సిబ్బందితో కలిసి ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు.గ్రామంలోని ప్రతి వీధిని పరిశీలించి, విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. పాత విద్యుత్ బకాయిలు చెల్లించాలని, అవసరమున్న చోట కొత్త ట్రాన్స్ఫార్మర్లు, స్తంభాలు, గృహాలకు మీటర్లు ఏర్పాటు చేసి ఎల్టీ లైన్లు వేసేలా వివరాలు నమోదు చేశారు. రైతులు, గ్రామస్థులు స్వయంగా విద్యుత్ పనులు చేపట్టకుండా, ఎలాంటి సమస్యలు ఉన్నా ముందుగా విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దపల్లి తిరుమల ఆజిమల్లు, ఉపసర్పంచ్ ఐద బుగ్గరామస్వామి, వార్డు సభ్యులు, లైన్ ఇన్స్పెక్టర్ కాసుల కిరణ్, లైన్ మెన్ మోతిలాల్, వరాల శ్రీనివాస్, అన్ మాండ్ సంతోష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించి 333 జీవో రద్దు చేయాలి

- రాయికంటి శ్రీనివాస్



**మానకొండూర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: మానకొండూర్ మండలం ఈదెలగట్టపెల్లి గ్రామంలోని గ్రామీణ ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్ సందర్శించారు.కూలీలు ఆరు వారాలుగా వేతనాలు అందక తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని, పని ప్రదేశాల్లో వాటర్ టెంట్, మెడికల్ గేట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా 333 జీవోను రద్దు చేసి, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని, రోజువారీ కూలి రూ.600 ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

# డి8 కాలువలో పిచ్చి మొక్కల తొలగింపు



**గన్నేరువరం, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామంలో సాగునీటి సమస్య పరిష్కారమైంది. గ్రామ సర్పంచ్ మాధరి శ్రీనివాస్ చొరవతో డి8 కెనాల్ కాలువలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, తుంగగడ్డిని జెసిబి సహాయంతో తొలగించారు. దీంతో ఊర చెరువులోకి నీరు సరిగా చేరి, రైతులకు సాగునీటి సౌకర్యం లభించేలా మారింది.ఈ చర్యకు గ్రామ రైతులు, ప్రజలు సర్పంచ్ మాధరి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.


# అంగరంగ వైభవంగా శ్రీకృష్ణ భగవాన్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం





**అమ్రాబాద్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ భగవాన్ దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజస్తంభ మహోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, సీబీఎమ్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ చిక్కుడు అనురాధ దంపతులు పాల్గొన్నారు.ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ, దేవాలయ అభివృద్ధికి తన సొంత నిధుల ద్వారా సహకరిస్తానని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటి సదుపాయం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టి కృషి చేస్తానని తెలిపారు. మద్దిమడుగు పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు ఈ దేవాలయాన్ని కూడా దర్శించుకునేలా అభివృద్ధి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అచ్చంపేట మున్సిపాలిటీ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్ నరసయ్య యాదవ్, ప్రజాప్రతినిధులు, స్థానిక సర్పంచ్, ఉపసర్పంచ్, దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రభుత్వ అధికారులు, పత్రికా విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలి



**పెద్దపల్లి, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హులైన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఒక ప్రకటనలో తెలిపారు. బి.పి.ఎల్ కుటుంబాలలో 18 నుంచి 60 సంవత్సరాల వయసు గల కుటుంబ పోషకుడు మరణించిన సందర్భంలో, ఆ కుటుంబానికి రూ.20,000 ఆర్థిక సహాయం అందజేయబడుతుందని కలెక్టర్ వివరించారు.దరఖాస్తులు పంచాయతీ కార్యదర్శి, ఎంపిడిఓ కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయం లేదా ఆన్లైన్ ద్వారా సమర్పించుకోవచ్చని తెలిపారు.ఈ పథకం కింద సహాయం పొందే కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఇతర ఆర్థిక సహాయాలు అందకపోవడం తప్పనిసరి అని కలెక్టర్ స్పష్టం చేశారు.

## గద్దర్ విగ్రహావిష్కరణ
# కరపత్రం విడుదల



**అచ్చంపేట, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని తెలంగాణ అమరవీరుల వేదిక వద్ద గద్దర్ విగ్రహావిష్కరణ కరపత్రాన్ని విడుదల చేశారు. మార్చి 8న కల్వకుర్తి పట్టణంలో గద్దర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా అభిమానులు, నాయకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కరపత్రం విడుదల కార్యక్రమంలో బీసీఎఫ్ స్టేట్ సెక్రటరీ డాక్టర్ నారమోని నరేష్ యాదవ్, జక్క గోపాల్, మహబూబ్ అలీ, పాతుకుల శ్రీశైలం, అనిల్, శ్రీను, కుందా మల్లికార్జున్, అజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.జీనా కసాంద్రా..

# ఘనంగా అయ్యప్ప దేవస్థానం వార్షికోత్సవ మహోత్సవం



**హుస్నాబాద్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ పట్టణంలోని సిద్ధేశ్వర గుట్టపై వెలసిన అయ్యప్ప దేవస్థానంలో 24వ వార్షికోత్సవ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.ఉదయం గణపతి పూజ, పుణ్యవచనం, అయ్యప్ప స్వామి పంచామృతాభిషేకం, విశేష పూజా కార్యక్రమాలు, అగ్ని ప్రతిష్ఠ, దేవత హోమం, ధర్మశాస్త్ర మూలమంత్రం నిర్వహించారు. అనంతరం దివ్య పదినిమిట్టాంబడి మెట్ల పూజ, అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఆకుల వెంకట్, మున్సిపల్ చైర్మన్ డండి లక్ష్మి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత, సుద్దాల చంద్రయ్య, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఐలేని అనిత, కమిటీ సభ్యులు సురేందర్ రెడ్డి, కొండ్ల సంపత్, శ్రీకాంత్, వడ్డేపల్లి వెంకటరమణ, బై వెంకటేష్, ఐత శ్రీధర్, వెన్ శెట్టి శివ, బుర్ర ప్రవీణ్, కౌన్సిలర్లు కొండ రజిత, వైద్యం కిరణ్, పిల్లి తిరుపతి, మహిళా భక్తులు హేమలత, రాణి తదితరులు పాల్గొన్నారు.దేవస్థానం పూజలు భానుమూర్తి, పవన్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

# శ్రీ స్వయంభు రాజేశ్వర స్వామి దేవాలయం హుండీ లెక్కింపు



**హుస్నాబాద్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలోని శ్రీ స్వయంభు రాజేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా హుండీల లెక్కింపు గురువారం ఆలయ మండపంలో నిర్వహించారు.ఈ లెక్కింపులో మొత్తం ఆదాయం రూ.6,47,739గా నమోదైంది. కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ సిద్దిపేట జిల్లా పర్యవేక్షకురాలు పట్లోళ్ల విజయలక్ష్మి పర్యవేక్షించారు. జాతర ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్, వార్డ్ సభ్యులు, గోమాత సేవా సమితి హుస్నాబాద్, శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం అర్చక సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.శ్రీ స్వయంభు రాజేశ్వర స్వామి దేవాలయం కార్యనిర్వాహణ అధికారి పి. కిషన్‌రావు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

# చంద్ర ప్రభు వాహనంపై ప్రహ్లాదుడు

**ఆళ్లగడ్డ ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారందిగువ అహోబిల క్షేత్రంలో చంద్రప్రభ వాహనంలో ప్రహల్లాద వరద స్వామి విహరించారు బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకుని పూజలు చేశారు బ్రహ్మోత్సవ కార్యక్రమాలను పీఠాధిపతి రంగనాథయతీంద మహాదేశిక న్ సీఈవో రామానుజన్ పరిరక్షణలో వేదపండితులు వైభవంగా నిర్వహిస్తున్నారు